సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



డ్రైవర్ల ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి తదితరులు



నాయుడుపేట సభకు తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సంక్షేమ పాలనతో సువర్ణాధ్యాయం లిఖించి.. రాజకీయాల్లో సరికొత్త ఒరవడి సృష్టించి.. పేదల అభ్యున్నతే లక్ష్యంగా నవరత్నాలతో నవశకానికి నాంది పలికి.. సకల జనులకు సమన్యాయం చేసి.. ఆరోగ్యశ్రీతో ప్రజలకు ఆయువు పోసి.. పల్లె ముంగిటకే వైద్యం తీసుకువచ్చి.. పేదబిడ్డల పెద్ద చదువులకు భరోసా కల్పించి.. రైతన్న చిరునవ్వుకు చిరునామాగా నిలిచి.. కపట 'కూటమి'కి సింహస్వప్నంగా నిలబడి.. పెత్తందార్లపై యుద్ధానికి 'సిద్ధం' అంటూ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టిన మీ వెంట నడిచేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ ప్రజానీకం జైకొట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు నీరాజనం పట్టింది. అడుగడుగునా అన్నతో ఆత్మీయత పంచుకుంటూ హర్షాతిరేకాలను వ్యక్తం చేసింది.



అవ్వ ఆశీర్వాదం



విద్యార్థిని కృతజ్ఞతాభిమానం

నువ్వే కావాలి..
మళ్లీ నువ్వే రావాలి

- సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నీరాజనం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళాలోకం
- అడుగడుగునా అపూర్వ స్వాగతం
- మండుటెండలోనూ రోడ్లకిరువైపులా బారులుతీరిన జనం
- ముఖ్యమంత్రి ఆత్మీయ పలకరింపుతో ఊరూరా వెల్లివిరిసిన ఆనందం



వృద్ధురాలి వాత్సల్యం



సెల్ఫీ తీసుకుంటూ విద్యార్థుల ఆనందం



గూడూరు బైపాస్‌లో పండ్ల మాలతో స్వాగతం



తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలివేటి సంజీవయ్య (సూళ్లూరుపేట), నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి (వెంకటగిరి), బియ్యపు మధుసూదన్‌రెడ్డి (శ్రీకాళహస్తి), మేరిగ మురళీధర్ (గూడూరు), భూమన అభినయ్‌రెడ్డి (తిరుపతి), నూకతోటి రాజేష్ (సత్యవేడు)ను గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రేణిగుంట, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గురవరాజుపల్లె నుంచి శుక్రవారం ఉదయం అశేష జనవాహిని నడుమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానులకు సీఎం వైఎస్ జగన్ ఆత్మీయంగా అభివాదం చేశారు. అనంతరం వెదుళ్లచెరువు వద్ద ముస్లింలతో మమేకమయ్యారు. ఏర్పేడు మండలం ఇసుకతాగేలి వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడి వారి బాగోగులను అరా తీశారు. సీతారాంపేట వద్ద కల్లుగీత కార్మికులతో ముచ్చటించారు. రైతు కూలీలతో మమేకమై వారు అందించిన వేరుశనగ కాయలను తిన్నారు. ఏర్పేడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. వేలాది మంది జనం జేజేలు పలుకుతూ పూలవర్షం కురిపించారు. మేర్లపాక దళితవాడ, కాపుగున్నేరి, మిట్టకండ్రిగ, శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ వద్ద రోడ్లకిరువైపులా జనం బారులు తీరి జయహో జగన్ అంటూ నినదించారు. ఏపీ సీడ్స్ కూడలి వద్ద ఆయన బస్సు పైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. చిన్నసింగమాలలో టిప్పర్, ఆటోడ్రైవర్లతో ముఖాముఖిలో పాల్గొన్నారు. చిల్లకూరు వద్ద కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. చావలి వద్ద మధ్యాహ్న భోజన విరామం తర్వాత నాయుడుపేట హైవే వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు. అశేష జనసందోహాను ద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు.



ఆశీర్వదించండి.. అండగా ఉంటాం..

దిష్టి తీసిన హిజ్రాలు

నాయుడుపేట బహిరంగ సభ అనంతరం గూడూరుకు బయలుదేరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 50మంది హిజ్రాలు దిష్టితీశారు. మళ్లీ మీరే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు.

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు..

నాయుడుపేట బహిరంగ సభ అనంతరం ముఖ్యమంత్రి బయలుదేరి గూడూరు నియోజకవర్గానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బూదనం టోల్‌ప్లాజా వద్ద పెద్దసంఖ్యలో మహిళలు, యువకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. గూడూరు బైపాస్ కూడలి వద్ద వేలాదిమంది ప్రజలు జేజేలు కొడుతూ ఘనంగా ఆహ్వానించారు. క్రేన్ సాయంతో పండ్లతో కూడిన గజమాలను వేశారు. బస్సు పైకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించారు.

హద్దులు చెరిపేసిన అభిమానం

అమ్మ ఒడి, విద్యాదీవెనతో ఉన్నత చదువుకు బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌తో సెల్ఫీ కోసం ఓ యువకుడు.. పెద్ద కొడుకులా నెలనెలా ఇంటికే పెన్షన్ పంపుతున్నాడని ఓ అవ్వ.. తన బిడ్డకు ఉద్యోగ అవకాశం కల్పించారని ఓ తల్లి.. సాగును సంబరం చేసినందుకు ఓ అన్నదాత.. వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధికి అవకాశం కల్పించినందుకు అక్కచెల్లెమ్మలు.. మండుటెండను సైతం లెక్కచేయకుండా.. పనులన్నీ వదిలిపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు, ఆత్మీయతను పంచుకునేందుకు బస్సు యాత్రకు ఎదురెళ్లారు. చెప్పులు తెగిపోయి అరికాళ్లు కాలుతున్నా.. జగనన్నా.. జగనన్నా అంటూ బస్సు వెంట పరుగులెత్తారు. వారిని గమనించిన సీఎం వైఎస్ జగన్ సైతం హోదాను పక్కన పెట్టి బస్సు దిగి వచ్చారు. ఎవరినీ నిరుత్సాహపరచకుండా అందరితో మమేకమయ్యారు. యోగక్షేమాలు విచారించారు.



జననేత కటౌట్లతో మహిళాలోకం



మేమంతా సిద్ధం.. సెల్‌ఫోన్‌లో నిక్షిప్తం



శ్రీకాళహస్తిలోని ఏపీ సీడ్స్ కూడలి వద్ద జనసందోహం



గూడూరు బైపాస్ కూడలిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల సంబరం



నాయుడుపేటలో ముఖ్యమంత్రికి జ్ఞాపిక బహూకరిస్తూ నేతల సంతోషం

క్లుప్తంగా

చిత్తూరు ఎస్పీగా మణికంఠ నియామకం



చిత్తూరు అర్బన్: చిత్తూరు కొత్త ఎస్పీగా వీఎస్ మణికంఠ చందోలు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్టణం సిటీ లా అండ్ ఆర్డర్ డీసీపీగా పనిచేస్తున్న ఈయన్ను చిత్తూరు ఎస్పీగా నియమించింది. చిత్తూరులో పనిచేస్తున్న జాషువాను ఇటీవల బదిలీచేసిన ఎన్నికల సంఘం.. ఆయన స్థానంలో ఎవరిని నియమించాలో ముగ్గురు పేర్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం సూచించిన పేర్లలో మణికంఠను తుదిగా చిత్తూరు ఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా 2018 బ్యాచ్‌కు చెందిన ఈ యువ అధికారి గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాంటెండ్, శ్రీకాకుళం జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఏఎస్పీగా విధులు నిర్వర్తించారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం



పుత్తూరు: ఎలక్ట్రికల్ స్కూటర్ నుంచి మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం వడమాలపేట మండలం అంజేరమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. ఈ ఘటనలో స్కూటర్‌పై వస్తున్న తండ్రీ కొడుకులు ఇద్దరూ క్షేమంగా బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వడమాలపేట మండలం పాపరాజుకండ్రిగ గ్రామానికి చెందిన శివకుమార్ తన తండ్రి సుబ్బరామయ్యతో కలసి కోమాకి కంపెనీకి చెందిన ఏపీ39 ఏంఎస్ 3619 నంబర్ గల ఎల్కక్ట్రికల్ బైక్‌పై పుత్తూరు వచ్చి పని ముగించుకుని, గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అంజేరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి స్కూటర్ నుంచి పొగలు రావడంతో ఇద్దరూ బైక్ దిగి పక్కకు వెళ్లారు. ఇంతలోనే బైక్ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.

షబ్ ఎ ఖదర్ రేపు

చిత్తూరు రూరల్: ఈనెల 6వ తేదీన ముస్లింలు షబ్ ఎ ఖదర్ పండుగను జరుపుకోవాలని జిల్లా ప్రభుత్వ జనాబ్ మోల్వి సయ్యద్ షా మొహమ్మద్ కమాలుల్లా జహురి లతీఫీ జునైది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ రాత్రి ముస్లింలు విశ్వశాంతికై భక్తిశ్రద్ధలతో జాగారం, నమాజు చేయాలన్నారు. అలాగే పేదలుకు దాన ధర్మాలు చేయాలని అందులో పేర్కొన్నారు.

మాపై ఎందుకీ కక్ష..!

"వయసు మళ్లింది.. కళ్లు కనపడవు.. చెవులు వినిపించవు.. లేవడానికి ఒంట్లో సత్తువ లేదు.. ఏమి చేసేది ముసలోళ్లం.. కాళ్లు చేతులు ఇరిగి మంచాన పడిన మాకు వలంటీర్లు వచ్చి ఇంటి కాడనే పింఛన్ ఇస్తాండ్రి.. ఈ చంద్రబాబు వలంటీర్లు ఇవ్వకూడదని ఏదో రాజకీయం చేసినాడంట.. మేమేం ఆయనకు ఏమి అన్యాయం చేశాం .. ఇలా మా మీద రాజకీయాలు చేసేకి.. ? ఇంత ఎండలో మేము ఇలా పాకుతూ.. దేకుతూ వచ్చి పింఛన్ తీసుకోవాలంటే ఎట్టా సామీ.." ఇవీ ప్రతి సచివాలయం వద్ద పింఛన్ కోసం వచ్చిన లబ్ధిదారుల నోటి నుంచి వచ్చిన మాటలు.

నా కడుపు మంట తగలకుండా పోదు..



నా భర్త నారాయణప్ప చనిపోయాడు. మొన్న కరోనాలో నా కొడుకు సుబ్రమణి కూడా చనిపోయాడు. కూతురికి పెళ్లి చేశా. ఆవును మేపుతూ గెనం పైనుంచి పడి నాకు నడుం విరిగింది. ఇంట్లో మంచానికే పరిమితమయ్యా. నెల నెలా వచ్చే పింఛనే దిక్కు. ఇన్నాళ్ల వలంటీర్ వచ్చి ఇంటికాడే పింఛను ఇచ్చేవాడు. ఇప్పుడు వాళ్లను తీయించి చంద్రబాబు పుణ్యం కట్టుకుండాడు. మా ఊరి నుంచి దేవదొడ్డిలోని సచివాలయానికి పోవాలంటే ఏడు కిలోమీటర్లు. బస్సులు లేక ఆటోల్లో పోవాలి. నాకేమో నడిచేకి కాదు. కనీసం నన్ను ఆటోలో తీసుకెళ్లేవారు లేరు. నేను ఎట్టా సచివాలయానికి వెళ్లాలి ? మాలాంటి వాళ్లకు ఇంత గతి పట్టించిన చంద్రబాబుకు నా కడుపుమంట తగలకుండా పోదు.

– కిట్టమ్మ, కామినేపల్లి, బైరెడ్డిపల్లి

ఆటోడ్రైవర్ సాయంతో..



కడపల్లి పంచాయతీ పోడుచేన్లుకు చెందిన కృష్ణప్ప(56) పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇప్పుడు పంచాయతీ కేంద్రంలోని సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోవాల్సి రావడంతో గ్రామంలో ఇతరుల కోసం వచ్చిన ఆటోలో స్థానికుల సాయంతో వచ్చాడు. ఆటో దిగి పింఛను తీసుకోవడానికి వీలు కాకపోవడంతో ఆటో డ్రైవర్, స్థానికులు ఓ స్టూల్‌పై ఆయనను కూర్చోబెట్టి మోసుకుంటూ వచ్చి పెన్షన్ ఇప్పించారు.

– శాంతిపురం

మాకెందుకు ఈ కష్టాలు ?



నడవలేని స్థితిలో ఉన్న మాకెందుకు ఈ కష్టాలు పెట్టారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఇంటివద్దకే వచ్చి పింఛను అందించడం ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు చంద్రబాబు పుణ్యమా అని మండుటెండలో కాళ్లు ఈడ్చుకుంటూ ఎక్కడో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సిన ఖర్మ పట్టింది. నా ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే ఉంది. అయినా పింఛను కోసం తిప్పలు తప్పడం లేదు.

– అమృతవళ్లి, చిత్తూరు

పడుతూ లేస్తూ వచ్చా..



టీడీపీ పాలనలో పంచాయతీ కార్యాలయాల వద్ద, సర్వర్ సమస్య అంటూ ఊరికి దూరంగానో పింఛన్ ఇచ్చేవారు. అక్కడికే వెళ్లి పింఛన్ తీసుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇబ్బందులు లేవు. మేం బాగుండడం ఇష్టం లేదు చంద్రబాబుకు. అందుకే మామీద ఇలా రాజకీయాలు చేస్తున్నాడు.

– బాబుసాహెబ్, కన్నికాపురం, పాలసముద్రం

ఎండకు సొమ్మసిల్లి పడిపోయి మృతి



గుడిపాల: మండలంలోని రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లె గ్రామానికి చెందిన వృద్ధుడు మురుగేష్(80) గురువారం ఉదయం 9గంటలకు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామభద్రాపురం సచివాలయానికి బయలుదేరాడు. ఎవరూ తోడు లేకపోవడంతో చుక్కావారిపల్లె నుంచి పొలాల మీదుగా రామభద్రాపురం సచివాలయాలనికి ఒకటిన్నర కిలోమీటర్ దూరం నడుచుకుంటూ బయలుదేరాడు. మార్గమధ్యలో వెళ్తుండగా ఎండ వేడిమి తాళలేక సొమ్మసిల్లి పడిపోయాడు. ఆ సమయంలో బండరాయిపై తల తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రెండు గంటల తరువాత స్థానికులు అతన్ని గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ చంద్రమహేష్ చూసి సొమ్మసిల్లి పడిపోవడంతో ఇలా జరిగిందని, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించాలన్నారు. అయితే అక్కడికి తరలించే లోపు చనిపోయాడు. తెలుగుదేశం పార్టీ వారు వలంటీర్ల ద్వారా ఇస్తున్న పింఛన్లను అడ్డుకోవడం వల్లే మురుగేష్ చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇది మంచి పద్ధతి కాదు..



స్వార్థ రాజకీయాల కోసం పింఛనుదారులను ఇబ్బందుల పాలు చేయడం మంచి పద్ధతి కాదు. ఎంతో సౌకర్యవంతంగా ఉండిన వలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టడం చూస్తే చంద్రబాబు కుటిల రాజకీయానికి అద్దం పడుతోంది. అన్ని పనులు వదులుకుని పింఛను తీసుకునేందుకు సచివాలయం వద్దకు వెళ్లి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన దుస్థితిని కల్పించారు.

– దామోదరం, చిత్తూరు

పండుటాకులపై పగ ఏంది..!



కాళ్లు కదపలేని స్థితిలో ఉన్న మాపై చంద్రబాబు పగ పెట్టుకున్నారు. ప్రతి నెలా వలంటీర్లు నేరుగా ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇచ్చేవారు. కానీ మాపై కూడా కక్ష సాధింపు చేయడం ఏంది..! ముసలీ ముతక అవస్థలు పడుతుంటే రాక్షసానందం పొందుతున్నాడు. చంద్రబాబు మంచి చేయడు.. ఎవరైనా మేలు చేస్తే చూసి ఓర్వ లేడు.

– కే.చిన్నమ్మ, వృద్ధురాలు, కేవీఎం అగ్రహారం, వెదురుకుప్పం

ఎంసీసీ ఉల్లంఘనలపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్: మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) ఉల్లంఘనపై వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు ఎంసీసీ నోడల్ అధికారి మురళీకృష్ణ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కుప్పం, చిత్తూరులలో ఎంసీసీ ఉల్లంఘనలపై మూడు ఫిర్యాదులు ఇటీవల నమోదైనట్లు తెలిపారు. సమగ్రంగా విచారణ చేసి ఆయా ఆర్‌ఓల నుంచి నివేదికలు తెప్పించుకున్నట్లు చెప్పారు. మూడు ఫిర్యాదులలో రెండింటిని పరిష్కరించామని ఆ నివేదికలను జిల్లా ఎన్నికల అధికారికి పంపినట్లు ఆయన తెలిపారు.

జేఈఈ మెయిన్స్ సెషన్–2 ప్రారంభం



విద్యార్థిని తనిఖీ చేస్తున్న సిబ్బంది

పూతలపట్టు: మండలంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జేఈఈ మెయిన్స్ సెషన్–2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరక పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు పరీక్షకు 172 మంది విద్యార్థులకు గాను 157 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి ముందే అభ్యర్థులను తనిఖీ చేసి అనుమతించారు. విజయవంతంగా మొదటి రోజు పరీక్షను నిర్వహించారు.

అందుకే జనసేనకు దూరం



'యెవ్, నేను జనసేన పార్టీనే. కానీ మా పవన్‌కల్యాణ్ పోయి చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్నాడని నేను సైకిల్‌కు ఓటు ఏసేదిలేదు. ఈ సారి నా ఓటు ఫ్యానుకే' అంటూ కర్లగట్టుకు చెందిన జనసేన కార్యకర్త శివ మాట. బైకుపై కూర్చున్న శివ మాట్లాడిన ఈ మాటలను తన మిత్రులు కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్త వైరల్ అయింది. పంచాయతీ కేంద్రమైన కర్లగట్టుకు చెందిన శివ చిన్నతనం నుంచి పవన్‌కల్యాణ్‌కు వీరాభిమాని. పవన్ సినిమా ఎక్కడ వేసినా మొదటిరోజే తొలి ఆట చూసేవాడు. ఏటా మిత్రులతో కలిసి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని గ్రామంలో ఘనంగా జరిపేవాడు. తన బంధువులు ఇతర పార్టీల్లో ఉన్నా జనసేన పార్టీ పెట్టాక తాను మాత్రం ఆ పార్టీ కోసమే నిలబడ్డాడు. గ్రామంలో ఫ్లెక్సీలు పెట్టి హడావుడి చేశాడు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తరఫున ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నాడు. కానీ ఇప్పుడు టీడీపీతో తమ పార్టీ పొత్తు పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. తన అభిమాన నాయకుడిని అందరికంటే టీడీపీ వాళ్లే ఎక్కువగా తిట్టారని, అలాంటి పార్టీకి తాను ఓటు వేయనని శివ తేల్చి చెప్పాడు. ఎలాంటి వివక్ష చూపకుండా జనానికి మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికే ఈదఫా ఓటు వేస్తానన్నాడు. – శాంతిపురం

88.02 శాతం పింఛన్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 88.02 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి వెల్లడించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6.28 గంటల వరకు 2,73,304 మందికి గాను 2,40,555 మందికి పింఛన్ అందజేశారు. మిగిలిన 32,749 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ భరత్ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. కుప్పంలో భరత్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో భరత్, ముత్తు, జ్ఞానశేఖర్, ప్రసాద్, అమరేష్, కృష్ణ, శివ, ఈశప్ప, హనుమంతు, రమేష్ ఉన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మణి, సచివాలయ కన్వీనర్ చంద్రబాబు, వైస్ సర్పంచ్ గజేంద్ర, వీఎస్ఎస్ చైర్మన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

– ఎంపికైన 39 మంది విశ్వం విద్యార్థులు



ఉత్తమ ప్రతిభతో సీట్లు సాధించిన విద్యార్థులు

తిరుపతి కల్చరల్: జాతీయ స్థాయిలో 2024–25 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ప్రభంజనం సృష్టించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో పి.గంగా జైదీప్‌రెడ్డి, లాస్య, ఎన్.లిఖిత, పి.ఉదయశ్రీ, జి.లక్ష్మి, ఎన్.కేతన్ భాస్కర్, ఎన్.జ్యోత్స్న, ఏ.గౌతం కుమార్, హేమంత్, కేథన్ తదితరులతో పాటు 39మంది విశ్వం విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో నవోదయ పాఠశాలల్లో సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎన్.విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను విశ్వం విద్యార్థులు సాధిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మాజీ సర్పంచ్



వెంకటరమణకు కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: మండల కేంద్రమైన వడమాలపేట మాజీ సర్పంచ్ వెంకటరమణ గురువారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనతో పాటు అనుచరులకు పార్టీ కండువాలు కప్పి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మతో కలిసి నడవాడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రోజమ్మ గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

శెట్టిన్ తంగాల్‌లో రూ.6 లక్షలు సీజ్



సీజ్ చేసిన నగదును చూపుతున్న బీఎన్ఆర్‌పేట పోలీసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం శెట్టిన్ తంగాల్ చెక్‌పోస్టులో గురువారం బీఎన్ఆర్‌పేట పోలీసులు రూ.6 లక్షలు సీజ్ చేశారు. పోలీసులు ఉదయం నుంచి శెట్టిన్ తంగాల్ వద్ద ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. చిత్తూరు –తమిళనాడు అరక్కోణం వెళ్లే బస్సులో చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి రూ.6 లక్షలు తీసుకెళ్తున్నాడు. పోలీసుల తనిఖీల్లో ఈ నగదు బయటపడింది. ఆ నగదుకు సంబంధించి వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో బీఎన్ఆర్‌పేట ఎస్ఐ వెంకటసుబ్బమ్మ నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించారు.

విద్యార్థి ఆత్మహత్య

చౌడేపల్లె: చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిరితేష్(14) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బత్తలాపురానికి చెందిన హేమకల్యాణి చౌడేపల్లె–1 సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. సచివాలయం సమీపంలో ఉన్న బజారువీధిలో ఉన్న ఇంట్లో అద్దె నివాసంలో ఉంది. ఎప్పటిలాగే ఆమె విధులకు వెళ్లగా సాయిరితేష్ స్కూల్‌కు వెళ్లి ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న పైకప్పు కొక్కికి ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లి ఇది గమనించిన తల్లి కేకలు వేసింది. అప్పటికే సాయిరితేష్ మృతి చెందాడు. కన్న కొడుకు మృతిచెందడంతో ఆర్తనాదాలు పలువురిని కలిచివేశాయి. అయితే బాలుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వసంతాపురం సచివాలయంలో పింఛన్ల పంపిణీపై ఆరా తీస్తున్న జేసీ శ్రీనివాసులు

గుడిపాల: మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మే 13న జరిగే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం ఆయన గుడిపాలలోని పానాటూరు, గొల్లమడుగు, వసంతాపురం పోలింగ్ కేంద్రాలతో పాటు గొల్లమడుగు వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఎస్ఎస్‌టీం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయా ? లేవా ? అన్ని మళ్లీ ఒక్కసారి పరిశీలించాలని తహసీల్దార్ విజయలక్ష్మికి సూచించారు. గొల్లమడుగు వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించి 24 గంటలు విధులు నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

పింఛన్ల పంపిణీని వేగవంతం చేయండి..

పింఛన్ల పంపిణీని వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన పానాటూరు, వసంతాపురం సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింఛన్ల కోసం వచ్చేవారికి షామియానా, కుర్చీలు, తాగునీటి సౌకర్యాలను కల్పించాలన్నారు. వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి,సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

చంద్రగిరి :యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఏప్రిల్ 10వ తేదీ నుంచి 30 రోజుల పాటు పురుషులకు ఉచితంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన పురుషులు శిక్షణకు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్యాషన్

తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.



పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్ళకు కూడా పై విధంగానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్టర్న్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

సంయుక్తారెడ్డి, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

న్యూస్‌మేకర్

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

‘నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది’ అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరేట్ స్టూడెంట్ బిహార్‌లోని ‘సమస్తిపూర్’ పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరఫున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఏ. సోషియాలజీ చేసి ఇప్పుడు ‘బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత’ అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. ‘మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు’ అనే ప్రశ్నకు ‘నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు’ అని తెలిపిందామె.

అత్తగారి ఊరు

పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. ‘ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం’ అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.

ఉగాది వంటిల్లు



ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.

ఉగాది పచ్చడి



కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోలీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: • వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి • చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి • మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి • ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. **గమనిక:** ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.

ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి

ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

పాల గారెలు



కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: • మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. • స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. • ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి • బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.

మజ్జిగ వడ



కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: • అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. • పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. • అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. • ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. • ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. • బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.